సాక్షి కామారెడ్డి

మంగళవారం । 2 । జూలై । 2024



ఫిర్యాదులను పరిష్కరించాలి

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 102 ఫిర్యాదులు నమోదయ్యాయి. కలెక్టర్ సంగ్వాన్ ఫిర్యాదులు స్వీకరించారు.

- 8లో ▸



విద్యావ్యవస్థ సక్రమంగా నడవాలి

నియోజకవర్గంలో విద్యావ్యవస్థను మెరుగు పరిచేందుకు కృషి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.6 /23.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నేడు ధ్రువపత్రాల పరిశీలన

తెయూ(డిచ్‌పల్లి) : దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరి విద్యార్థులకు మంగళవారం (02న) ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తారని దోస్త్ కోఆర్డినేటర్ కే సంపత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ పరిపాలనా భవనంలోని అకడమిక్ ఆడిట్ సెల్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందన్నారు. పీహెచ్‌సీ (దివ్యాంగులు), సీఏపీ, ఎన్‌సీసీ, ఎక్స్‌ట్రా కరిక్యులర్ ఆక్టివిటీస్ విద్యార్థులు మాత్రమే హాజరు కావాలని ఆయన తెలిపారు.

జిల్లా 'సమాచారం' ఆవిష్కరణ



కామారెడ్డి క్రైం: జిల్లా ముఖ్య ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కామారెడ్డి జిల్లా సమాచారం 2022–23 హ్యాండ్ బుక్‌ను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సమాచారం జిల్లా యంత్రాంగానికి, విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సీపీవో రాజారాం, అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ యాక్టు అమలు

కామారెడ్డి క్రైం: జిల్లాలో 7వ తేదీ వరకు 30, 30ఏ పోలీస్ యాక్టు అమలులో ఉంటాయని ఎస్పీ సింధు శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుశాఖ అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు చేపట్టరాదని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా పశువైద్యాధికారిగా రోహిత్‌రెడ్డి



కామారెడ్డి క్రైం: బాన్సువాడ ఏడీ రోహిత్‌రెడ్డికి జిల్లా పశువైద్య, పశు సంవర్థక శాఖ అధికారిగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కలిశారు.

రామారెడ్డి ఆస్పత్రికి ఎన్‌క్యూఏఎస్ అవార్డు

రామారెడ్డి: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్యూఏఎస్) అవార్డుకు ఎంపికైందని వైద్యాధికారి సురేశ్ తెలిపారు. ఈ అవార్డును కేంద్ర వైద్య శాఖ ఆధ్వర్యంలో నడిచే ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఇస్తుందన్నారు. ఈ ఏడాది జనవరిలో ఢిల్లీ నుంచి వచ్చిన వైద్య బృందం రామారెడ్డి పీహెచ్‌సీని తనిఖీ చేసిందని పేర్కొన్నారు. పారిశుధ్యం, సేవల్లో నాణ్యత, ప్రసవాలు, రికార్డుల నిర్వహణ, ఓపీ, ఐపీ తదితర అంశాలను పరిశీలించి అవార్డుకు ఎంపిక చేశారన్నారు. అవార్డు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. రోగులకు మరింత నాణ్యమైన సేవలను అందించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిజామాబాద్‌లో 1,321 మంది బదిలీ

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో 1,321 మంది ఎస్జీటీలను బదిలీ చేయగా వారు కొత్త స్థానాల్లో చేరారు. ఇందులో 157 మంది ప్రభుత్వ విభాగం, 1,164 జెడ్పీ విభాగం టీచర్లు ఉన్నారు. బదిలీల కోసం ఏళ్లుగా నిరీక్షిస్తున్న టీచర్లు స్థాన చలనంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దశాబ్దాల సేవ..
శేషజీవితానికేదీ భరోసా?

- అమలులోకి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల రిటైర్మెంట్
- జిల్లాలో 51 మంది టీచర్లు, 117 మంది ఆయాలు ఇంటికి..
- విధులకు దూరం కావాల్సి రావడంతో ఆవేదన
- రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై పెదవి విరుపు
- నగం వేతనమైనా పింఛన్‌గా ఇవ్వాలని వినతి

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పదవీ విరమణ అమలులోకి వచ్చింది. జిల్లాలో 65 ఏళ్ల వయసు దాటిన 51 మంది టీచర్లు, 117 మంది ఆయాలు రిటైర్ అయ్యారు. అయితే దశాబ్దాలుగా ఆరేళ్లలోపు పిల్లలే లోకంగా గడిపినవారు.. వారికి దూరం కావాల్సి రావడంతో ఆవేదన చెందుతున్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై పెదవి విరుస్తున్నారు. జీవితమంతా ధారబోశామని, శక్తి ఉడిగిన వయసులో కుటుంబం గడవడానికి కనీసం జీతంలో సగమైనా ఇవ్వాలని కోరుతున్నారు.



సాక్షి, కామారెడ్డి : అంగన్‌వాడీలలో తప్పనిసరి రిటైర్మెంట్ అమలు చేస్తూ సర్కారు నిర్ణయం తీసుకోవడంతో 65 ఏళ్లపైబడిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఆవేదన చెందుతున్నారు. ఎలాంటి పింఛన్ సౌకర్యం కల్పించకుండా రిటైర్మెంట్ ఇవ్వడంతో శేష జీవితాన్ని ఎలా గడపాలని ప్రశ్నిస్తున్నారు.

ఐసీడీఎస్‌లో పనిచేస్తున్నవారిలో చాలామంది టీచర్లు, ఆయాలకు మూడు నాలుగు దశాబ్దాల అనుభవం ఉంది. అప్పట్లో రూ.150 జీతంతో పలువురు అంగన్‌వాడీ టీచర్లుగా చేరారు. అరకొర వేతనాలతో మూడు నాలుగు దశాబ్దాలపాటు పనిచేశారు. ప్రస్తుతం టీచర్లకు రూ. 13,650, ఆయాలకు రూ. 7,800 వేతనం ఇస్తున్నారు. ఇన్నాళ్లూ వారికి తప్పనిసరి రిటైర్మెంట్ లేదు. శక్తి ఉన్నంత వరకు పనిచేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకునేవారు. ప్రస్తుతం ప్రభుత్వం వారికి తప్పనిసరి ఉద్యోగ విరమణను తీసుకువచ్చింది. ఏప్రిల్ 30 నాటికి 65 ఏళ్లు పూర్తి చేసుకున్న టీచర్లు, హెల్పర్లు తప్పకుండా రిటైరవ్వాలని ఆదేశించింది. రిటైర్మెంట్ బెనిఫిట్ కింద టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు ఇస్తామని ప్రకటించింది. దీనిపై వారు పెదవి విరుస్తున్నారు. అరకొర వేతనాలతో మూడు నాలుగు దశాబ్దాలు పనిచేశామని, ఇప్పుడు ఈ కొద్దిపాటి డబ్బులతో ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారు. 65 ఏళ్లు దాటిన కారణంగా ఉద్యోగాల నుంచి తొలగించడం మూలంగా రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనలు చేసినా..

టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని కొంత కాలంగా అంగన్‌వాడీ ఉద్యోగులు ఆందోళనలు చేస్తున్నారు. దశాబ్దాల తరబడిగా సేవ చేసిన తమను గుర్తించకపోవడం శోచనీయమని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు చేసేవారికి అన్ని రకాల ప్రయోజనాలు కల్పించడంతో పాటు పెన్షన్ కూడా పెద్ద మొత్తంలో ఇస్తారని, తమకు కనీసం జీతంలో సగం పెన్షన్ అయినా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ప్రభుత్వం వారి ఆందోళనను పరిగణనలోకి తీసుకోలేదు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను పెంచకుండానే ఉద్యోగ విరమణను తప్పనిసరి చేస్తూ జీవో జారీ చేసింది. జీవితమంతా దారబోశామని, చేతగాని వయసులో కుటుంబం గడవడానికి కనీసం జీతంలో సగమైనా పెన్షన్‌గా ఇవ్వాలని అంగన్‌వాడీ ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరుతున్నారు.

బాధగా ఉంది



అంగన్‌వాడీ టీచర్‌గా 43 ఏళ్లపాటు పనిచేసిన. ప్రజలకు ఎంతో సేవజేసిన. 65 ఏండ్లు దాటినోళ్లను ఉద్యోగం నుంచి దింపుతున్నరు. మాకు కనీసం రూ.2 లక్షలు రిటైర్మెంట్ కింద ఇవ్వాలని కోరినా ప్రభుత్వం పట్టించుకోలేదు. రెండుసార్లు ఉత్తమ టీచర్ అవార్డు తీసుకున్న. ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బాధపడుతున్న.

– సులోచన, అంగన్‌వాడీ టీచర్, హసన్‌పల్లి, నిజాంసాగర్ మండలం

రూ. 150 వేతనంతో చేరిన..



నేను విధుల్లో చేరినప్పుడు జీతం రూ. 150. ఏండ్ల సంది ప్రజలకు సేవ చేసినం. ప్రభుత్వం ఏ కార్యక్రమం తీసుకున్నా పనిచేసినం. 65 ఏళ్లు దాటినయని ఇప్పుడు ఉద్యోగం తీసేస్తమంటే ఎట్లా? ఇన్నేండ్లు పని చేయించుకుని వృద్ధాప్యంలో ఇబ్బంది పెడుతున్నరు. కనీసం సగం జీతమన్న పింఛన్ కింద ఇవ్వాలి.

–భారతి, అంగన్‌వాడీ టీచర్, మహ్మద్‌నగర్

నా బిడ్డకు ఉద్యోగం ఇవ్వండి



ముప్పై ఏండ్ల కిందట భర్త చనిపోయిండు. అంగన్‌వాడీలో ఆయమ్మగా ఉద్యోగం చేస్తూ కూతురును పెంచి పెద్ద చేసిన. నాకు ఇల్లు గానీ, భూమి కానీ లేదు. జీతం డబ్బులతోనే బతుకుతున్న. ఇప్పుడు వయసు అయిపోయిందని ఉద్యోగంలనుంచి తీసేస్తే నా బతుకు ఆగమైతది. నా బిడ్డకు ఉద్యోగం ఇస్తే బతుకుతం.

–సాయవ్వ, ఆయా, పిట్లం

ప్రభుత్వం పునరాలోచించాలి




ప్రభుత్వ ఉద్యోగులకు అన్ని రకాల ప్రయోజనాలుంటాయి. దశాబ్దాలపాటు అరకొర వేతనాలతో పనిచేసిన మాకు మాత్రం పింఛన్ ఇవ్వరట. రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.లక్ష ఇస్తే దేనికి సరిపోతయి. కనీసం రూ.2 లక్షలు ఇవ్వాలి. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలి.

– కదారి మరియ, అంగన్‌వాడీ టీచర్, తలమడ్ల, రాజంపేట మండలం

అమలులోకి కొత్త చట్టాలు

తొలి రోజు పలు ఠాణాల్లో కేసులు నమోదు



గండివేట్ పాఠశాలలో ధ్వంసమైన టీవీని పరిశీలిస్తున్న ఎస్సై ఆంజనేయులు

సాక్షి, కామారెడ్డి: బ్రిటిష్ వలస పాలన నాటి చట్టాల స్థానంలో కొత్తగా రూపొందించిన మూడు నేర న్యాయ చట్టాలు ఆదివారం అర్ధరాత్రి తర్వాత అమలులోకి వచ్చాయి. ఐపీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), సీఆర్‌పీసీ స్థానంలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ సాక్ష్య అధినియమ్ (బీఎస్ఏ) తీసుకువచ్చారు. తొలిరోజు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్‌లలో ఆయా చట్టాల ప్రకారం కేసులు నమోదయ్యాయి. కొత్త చట్టాల ప్రకారం ఏ కేసులోనైనా ప్రాథమిక విచారణ జరిపి అవసరమైతేనే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు. పోలీస్ స్టేషన్‌తో సంబంధం లేకుండా సంఘటన ఎక్కడ జరిగినా ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి అవకాశం ఉంటుంది.

నమోదైన కేసులు..

- గాంధారి మండలం గండివేట్ ఉన్నత పాఠశాలలో అమర్చిన డిజిటల్ టీవీని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఆంజనేయులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 324(5) ప్రకారం కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు.
- భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డికి చెందిన పదో తరగతి విద్యార్థిని సాయి గ్రామ శివారులోని మామిడి తోటలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అనారోగ్య సమస్యతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకుందని ఆమె తండ్రి హరిబాబు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 194 ప్రకారం కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్జీటీల బదిలీలకు మోక్షం!

- జిల్లాలో ట్రాన్స్‌ఫర్స్ కోసం 1,494 దరఖాస్తులు
- 1,129 మందికి స్థాన చలనం
- సీనియారిటీ లేక 365 మందికి నిరాశ



కామారెడ్డి టౌన్: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియకు ఎట్టకేలకు మోక్షం లభించింది. సోమవారం బదిలీ ప్రక్రియ పూర్తి చేశారు. బదిలీల కోసం జిల్లావ్యాప్తంగా 1,494 మంది సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ) దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. రాష్ట్ర విద్యాశాఖ సోమవారం సీనియారిటీకి సంబంధించిన తుది జాబితాను ప్రకటించింది. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. 1,129 మందిని బదిలీ చేశారు. సీనియారిటీ లేని కారణంగా 365 మంది దరఖాస్తులను తిరస్కరించారు.

రిలీవర్ ఉంటేనే బదిలీ

ఓవైపు బదిలీలతో సంతోషం వ్యక్తమవుతున్నా.. రిలీవర్ ఉంటేనే బదిలీ చేయాలన్న నిబంధనతో జిల్లాలో 280 మంది ఇబ్బందిపడుతున్నారు. ఉదాహరణకు మాచారెడ్డి మండలం రత్నగిరిపల్లె ప్రభుత్వ పాఠశాలలో ఆరుగురు ఎస్జీటీలు విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో పోస్టులను కుదించనున్నారు. దీంతో బదిలీల్లో రెండు పోస్టులు మాత్రమే చూపించారు. నాలుగు పోస్టులను బ్యాక్‌లాగ్ చేశారు. ఈ స్కూల్‌లో పనిచేస్తున్న ఆరుగురు ఉపాధ్యాయులు ట్రాన్స్‌ఫర్ అయినా.. కొత్తగా ఇద్దరు టీచర్లు వచ్చినా పాతవారిని రిలీవ్ చేయలేని పరిస్థితి నెలకొంది. ఇలాంటి సమస్య జిల్లా వ్యాప్తంగా సుమారు 280 మంది ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్నారు. అంతర్గత రేషనలైజేషన్ ప్రక్రియతో సంబంధం లేకుండా అందరినీ బదిలీ అయిన స్థానాలకు పంపించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కాగా జిల్లాలో బదిలీల ప్రక్రియ పూర్తయ్యిందని డీఈవో తెలిపారు. రిలీవర్ ఉన్నచోట మాత్రమే బదిలీలు చేయాలని ఉన్నతాధికారులనుంచి ఆదేశాలు ఉన్నాయన్నారు. వారి ఆదేశాల మేరకు నడుచుకుంటామని పేర్కొన్నారు.

డీఎస్ అందరికీ అవకాశాలు ఇచ్చారు

- ఏపీ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

ఖలీల్‌వాడి: డీఎస్ అందరికీ అవకాశాలు కల్పించారని ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. కంఠేశ్వర్ బైపాస్‌లోని డీఎస్ వ్యవసాయ క్షేత్రంలో దహన సంస్కారాలు చేసిన స్థలానికి వెళ్లి ఆయన డీఎస్‌కు నివాళి అర్పించారు. ఎంపీ అర్వింద్‌ను పరామర్శించారు. అనంతరం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రెండుసార్లు కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి డీఎస్, వైఎస్సార్ కృషి చేశారని పేర్కొన్నారు. డీఎస్ తనకు కూడా సహకారం అందించారని గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి గడుగు గంగాధర్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కేశవేణు, వైసీపీ పార్టీ నేతలు ఉన్నారు.



అర్వింద్‌ను ఓదారుస్తున్న బొత్స సత్యనారాయణ

సేవలు మర్చిపోలేనివి..



నివాళులు అర్పిస్తున్న మంత్రి సీతక్క

ధర్మపురి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మర్చిపోలేనివని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సోమవారం ప్రగతినగర్‌లోని డీఎస్ నివాసంలో డీఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమె నివాళులు అర్పించారు. అనంతరం మాజీ మేయర్ ధర్మపురి సంజయ్‌ను పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డీఎస్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోట న్నారు. డీఎస్ ఆశయాలను నెరవేర్చినప్పుడే నిజమైన నివాళి అర్పించినట్లు అని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య పేర్కొన్నారు.

'పరస్పర గౌరవంతోనే జాతీయ సమైక్యత'




జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొన్న ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: ఒకరి విశ్వాసాలను మరొకరు గౌరవించుకోవడం వల్లే దేశంలో జాతీయ సమైక్యత పరిఢవిల్లుతోందని యునైటెడ్ యూత్ ప్రాజెక్ట్ చైర్మన్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కామారెడ్డిలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సమైక్యత శిబిరం సోమవారం ముగిసింది. శిబిరంలో దేశంలోని 14 రాష్ట్రాలలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. యూత్ పార్లమెంట్, సంస్కృతి, సంప్రదాయాల ప్రదర్శన, వివిధ అంశాలపై చర్చావేదికలు, చారిత్రక ప్రదేశాల సందర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రమదానం, దేశభక్తి, సేవా, దేశా నిర్మాణం అంశాలను ప్రతిబింబించే జానపద కళారూపాలను స్థానిక కళాభారతి ఆడిటోరియంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజానికి రోజుకో గంట సమయాన్ని కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు శ్రీనివాస్, మహ్మద్ అల్లావుద్దీన్, నిహారిక, పరశురాం, చందు, మక్సూద్, పవన్, రాజ్‌కుమార్, కుల్దీప్, దివ్య మానస, జెస్సిక, సాంచీ, జల్లే మూర్తి, గణేష్, కనిక హజారిక, గోవింద్, అమిత్ కొటే, సాహిల్ యాదవ్, ప్రశాంత్, సుధాకర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

బాబ్లీ గేట్ల ఎత్తివేత



కందకుర్తి వంతెన వద్ద ప్రవహిస్తున్న వరద నీరు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఎగువన మహారాష్ట్ర సర్కార్ నిర్మించిన బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లను సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు త్రిసభ్య కమిటీ సభ్యుల పర్యవేక్షణలో గేట్లు ఎత్తారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం జూలై 1 న గేట్లు ఎత్తి, అక్టోబర్ 28న గేట్లను మూసి వేయాలి. మహారాష్ట్ర సరిహద్దులో గేట్లు మూసే వరకు నిల్వ ఉండే నీటికి బదులుగా మార్చి 1 గేట్లు ఎత్తి 0.6 టీఎంసీలు బాబ్లీ నుంచి ఎస్సారెస్పీకి అందించాలని తీర్పులో పేర్కొ న్నారు. సోమవారం తెలంగాణ ప్రభుత్వం తరఫున ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్ గుప్తా, ఈఈ చక్రపాణి, ఏఈఈ వంశీ, మహారాష్ట్ర తరుపున నాందెడ్ ఈఈ బస్వాద్, సెంట్రల్ వాటర్ కమిషన్ నుంచి ఈఈ వెంకటేశ్వర్లు పాల్గొని పర్యవేక్షించారు. వీరి పర్యవేక్షణలో ఉదయం 11.00 గంటల నుంచి గేట్లు ఎత్తడం ప్రారంభించి ప్రతి 45 నిమిషాలకొక గేటును ఎత్తుతు సాయంత్రం వరకు 14 గేట్లు ఎత్తినట్లు అధికారులు తెలిపారు. గత రెండు రోజులుగా వర్షాలు కురువడంతో బాబ్లీ ప్రాజెక్ట్‌లోకి స్వల్పంగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో గేట్లు ఎత్తగానే గోదావరిలోకి నీరు ఉరకలేసింది. బాబ్లీ ప్రాజెక్ట్ నీటి సామర్థ్యం 2.74 టీఎంసీలు. బాబ్లీ గేట్లు ఎత్తడంతో గోదావరికి జల కళ వచ్చింది. ఎగువ ప్రాంతాల నుంచి వరదలు వస్తే ఎస్సారెస్పీకి అడ్డు లేకుండా బాబ్లీ గేట్లను అక్టోబర్ 28 వరకు తెరిచి ఉంచాల్సిందే.



బాబ్లీ ప్రాజెక్ట్ వద్ద త్రిసభ్య కమిటీ సభ్యులు, అధికారులు



బాబ్లీ గేట్లు ఎత్తుతున్న దృశ్యం

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వలన ప్రాజెక్ట్‌లోకి వరద నీరు కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 3935 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్ట్ నీటి మట్టం పెరుగుతుంది. బబ్లీ గేట్లు ఎత్తడంతో మరింత వరద నీరు పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1059.90(10.74 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

గోదావరికి జలకళ

రెంజల్(బోధన్): నిన్నటి వరకు నీళ్లు లేక ఇసుక మేటలతో దర్శనమిచ్చిన గోదావరి జలకళను సంతరించుకుంది. మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు సోమవారం ఎత్తడంతో దిగువకు వరద నీరు పరుగులు పెడుతోంది. కందకుర్తి వద్ద వరద నీరు వచ్చి చేరడంతో పాటు మంజీర, హరిద్ర నదుల నుంచి వస్తున్న చిన్న పాయల నీటితో త్రివేణి సంగమ పుష్కరక్షేత్రం వద్ద గోదావరి నది పరవళ్లు తొక్కుతోంది. నదిలోని పురాతన శివాలయాన్ని ఆనుకొని నీరు ప్రవహిస్తోంది. దీంతో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ సిబ్బందితో పుష్కర ఘాట్లకు వచ్చి భక్తులను అప్రమత్తం చేశారు.

క్లుప్తంగా

పాత చెరువు తూముల పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ గ్రామ పాత చెరువు కుడి, ఎడమ పంట కాలువల తూములను సోమవారం నీటిపారుదలశాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ కాశీనాథ్ పరిశీలించారు. పాత చెరువు పంట కాలువ తూములు కిందకు దిగకపోవడంతో పాటు పైకి రాకపోవడంతో చెరువు నీరు వృథా అవుతుందని రైతులు నీటిపారుదలశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పందించిన నీటిపారుదలశాఖ అధికారులు తూముల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయడంతో సదరు తూముల స్థితిగతులు, సిమెంట్ సైడ్ వాళ్లను పరిశీలించారు. రైతులు చాకలి డాకయ్య, పి రాజేందర్, సాయిరాం,సంగయ్య,సాయిలు తదితరులు ఉన్నారు.

4న కిడ్స్ అథ్లెటిక్స్ ఎంపికలు

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4న ఉదయం 8గంటలకు గురువారం స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో జిల్లా స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్ తెలిపారు. 8, 10, 12 ఏళ్ల బాలబాలికలకు వివిధ అథ్లెటిక్స్ అంశాల్లో ఎంపికలుంటాయన్నారు. క్రీడాకారుల డ్రెస్‌కోడ్‌తో హాజరై పుట్టిన తేది సర్టిఫికెట్ జిరాక్స్ తప్పని సరిగా ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

బైక్‌సీటులో నాగుపాము



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో స్వీట్ దుకాణం నడుపుతున్న జ్ఞానేశ్వర్ ఎప్పటి లాగే దుకాణం పక్కనున్న గల్లీలో సోమవారం బైక్‌ను పార్క్ చేశాడు. సాయంత్రం బైక్ సీటులోకి చేరిన నాగుపామును గమనించిన స్థానికులు జ్ఞానేశ్వర్‌కు తెలిపారు. పామును బయటకి పంపించేందుకు జ్ఞానేశ్వర్ ఎంత ప్రయత్నించినా బయటకు రాకపోవడంతో పాములు పట్టే వ్యక్తిని రప్పించారు. సదరు వ్యక్తి పామును బయటికి తీయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : సదాశివనగర్ మండల కేంద్రం శివారులో సోమవారం పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. పక్కా సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 12,730 నగదును, ఏడు సెల్ ఫోన్‌లను, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



వినతిపత్రం అందిస్తున్న మలి తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ప్రతినిధులు

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 102 వినతులు



కలెక్టరేట్‌లో బారులు తీరిన ఫిర్యాదుదారులు

కామారెడ్డి క్రైం : ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 102 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 55 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించినవి కావడం గమనార్హం. మరో 13 డీఆర్‌డీవో, 9 హౌసింగ్, 5 డీపీవో, 3 మున్సిపల్ శాఖలకు చెందిన ఫిర్యాదులు నమోదు కాగా మిగితావి ఆయా శాఖలకు చెందినవి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణితో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన ఫిర్యాదులకు సైతం అత్యంత ప్రాధాన్యత కల్పించి పరిశీలించాలన్నారు. ఆ వెంటనే పరిష్కారాలు చూపడం గానీ, ప్రత్యామ్నాయ మార్గాలు గానీ ఫిర్యాదు దారునికి తెలియపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్డీవో చందర్, డీపీఓ శ్రీనివాసరావు, సీపీవో రాజారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, డీఏవో భాగ్యలక్ష్మి, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి..

మలి తెలంగాణ ఉద్యమంలో పాల్గొని రాష్ట్ర సాధనకు కృషి చేసిన ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా మలి తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఐక్యవేదిక ప్రతినిధులు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు 6 గ్యారెంటీల్లో భాగంగా ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు, ఇతర సౌకర్యాలను అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోగా కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. 7 నెలలు దాటినా ఉద్యమకారుల గురించి ఎలాంటి ప్రకటన రాలేదన్నారు. ప్రతి ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలం, ఉచిత బస్సు సౌకర్యం, నెలకు రూ.25 వేలు పెన్షన్, ఆరోగ్య భీమా, రూ.50 లక్షల ప్రమాద భీమా, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

పేద ప్రజలకు అండగా నిలుస్తాం



భిక్కనూరు : పేద ప్రజలకు అండగా ఉంటానని సమాచార హక్కు చట్టం ప్రతినిధి రవీందర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పాత దళిత వాడలో రేషన్ షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45ఏళ్లుగా దళిత ప్రజలు రేషన్ కోసం పట్టణానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి స్థానికంగా రేషన్ షాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సమ్మేళనానికి తరలిన బంజారాలు

కామారెడ్డి టౌన్ : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరుగుతున్న జాతీయ గోర్ బంజారా సమ్మేళనానికి జిల్లా కేంద్రం నుంచి సోమవారం బంజారా నాయకులు ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. లంబాడ హక్కుల పోరాట సమితి, బంజార సంఘాల నాయకులు రాణాప్రతాప్, గణేశ్‌నాయక్, భూక్యరాజు, వినోద్‌నాయక్ ఆయా మండలాల నుంచి నాయకులు తరలివెళ్లారు.

ఫీజు బకాయిలు చెల్లించండి

కామారెడ్డి టౌన్ : రాష్ట్రంలో విద్యార్థులకు రావాల్సిన ఫీజు రియంబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే చెల్లించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 5వేల కోట్లు బకాయిలు చెల్లాంచాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, రాజేందర్, ప్రశాంత్, ఆత్మారాం తదితరులున్నారు.

మేజర్‌వాడిలో బోనాల పండుగ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని మేజర్‌వాడిలో సోమవారం బోనాలపండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామశివారులోని పోచమ్మ అమ్మవారికి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను జరిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు నెత్తిన బోనాలనెత్తుకొని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు.

గుట్కా విక్రయదారుడిపై కేసు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్డులో గుట్కా విక్రయిస్తున్న దుకాణంపై పట్టణ పోలీసులు సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. దాదాపు 70 ప్యాకెట్ల నిషేధ గుట్కా ను స్వాధీనం చేసుకున్నారు. నూతనంగా అమలులోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత చట్టం 272, 275 కింద కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

ప్రింటింగ్‌ప్రెస్ యజమాని అదృశ్యం



భిక్కనూరు : మండల కేంద్రానికి చెందిన ప్రింటింగ్ ప్రెస్ యజమాని అదృశ్యమైనట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన శేఖర్ గౌడ్ పట్టణంలో ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు చెప్పారు. గతనెల 29న ఆయన షాప్‌కు వచ్చి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ప్రింటింగ్ ప్రెస్ వద్దకు వచ్చి చూడగా ఆయన వాహనం అక్కడే ఉండగా శేఖర్‌గౌడ్ కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో ఆయన కోసం గాలించగా ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో ఆత్మహత్య



పోశెట్టి మృతదేహం

వర్ని (మోస్రా): మండలంలోని గోవూరు గ్రామానికి చెందిన ఈబితి పోశెట్టి (25) తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. ఓ వైపు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువకావడం, మరోవైపు భార్యతో విడాకులు తీసుకోవడంతో మనస్తాపానికి గురైన పోశెట్టి సోమవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మతిస్థిమితం లేని బాలిక..



భిక్కనూరు: మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయి కుమార్ తె లిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్ద కూలీ పనులు చేస్తూ ఓ కుటుంబం జీవిస్తోంది. ఆ కుటుంబంలోని 15ఏళ్ల బాలిక కొంతకాలం క్రితం మతిస్థిమితం కోల్పోయింది. సోమవారం కుటుంబ సభ్యులు విత్తనాల కోసం మెదక్ జిల్లా రామాయంపేట పట్టణానికి వెళ్లగా.. ఆమె అక్కడే ఉన్న చెట్టుకు ఉరేసుకుంది. గమనించిన కూలీలు ఆమెను చికిత్స నిమిత్తం తరలించగా అప్పటికే మృతి వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..

నిజామాబాద్ రూరల్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మారుతినగర్‌లో అనిరుధ్‌రెడ్డి అనే వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో మహేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కొన్ని రోజులుగా అనిరుధ్‌రెడ్డి(28) స్విగ్గీలో పని చేస్తుండగా, అతడి భార్య స్వాతి ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. సోమవారం ఉదయం రోజూలాగే స్వాతి డ్యూటీకి వెళ్లగా అనిరుధ్ ఇంట్లోనే ఉన్నాడు. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువకావడంతో మనస్తాపానికి గురైన అనిరుధ్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మహారాష్ట్రకు చెందిన వ్యక్తి..

నవీపేట: మండలంలోని గాంధీనగర్ శివారులో ఉనన కోళ్లఫామ్‌లో మహారాష్ట్రలోని ఉద్మికి చెందిన ప్రతాప్ లాడిగె(40) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉపాధి నిమిత్తం ప్రతాప్ రెండేళ్ల క్రితం భార్యాపిల్లలతో కలిసి గాంధీనగర్‌కు వచ్చాడు. ఏడాది క్రితం జరిగిన ఓ ప్రమాదంలో ప్రతాప్ రెండు కాళ్లు కోల్పోయాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక వేలం

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఆవరణలో సోమవారం మూడు ట్రాక్టర్ల ఇసుకను వేలం వేశారు. వేలంలో పాల్గొన్న వారు మూడు ట్రాక్టర్ల ఇసుకను రూ.5,300కు దక్కించుకున్నట్లు తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుకను గతనెల 21న పట్టుకొని వేలం వేశామన్నారు.

విద్యావ్యవస్థ సక్రమంగా నడవాలి

జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



పెద్ద ఎక్లారలో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న విద్యార్థిని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మద్నూర్(జుక్కల్) : నియోజకవర్గంలో విద్యావ్యవస్థ సక్రమంగా నడవాలని దీనికోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదేశించారు. మండలంలోని పెద్దఎక్లార బాలికల గురుకుల పాఠశాలలో నియోజకర్గంలోని గురుకుల పాఠశాలలు, నవోదయ, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల ప్రిన్స్‌పాళ్లతో సోమవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. నియోజవర్గంలో విద్యావ్యవస్థ వెనుకబడి ఉన్న పేరును చెరిపేసే విధంగా ప్రిన్సిపాళ్లు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఇక నుంచి నియోజికవర్గంలోని ప్రతి పాఠశాల, కళాశాలను సందర్శిస్తానన్నారు. ప్రభుత్వం విద్యార్థుల చదువుల కోసం రూ. కోట్ల నిధులు, వసతులు కల్పిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాల, కళాశాలలో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులు, లెక్చరర్ల భర్తీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రిన్స్‌పాళ్లు పాల్గొన్నారు.

'రైతుబంధు'పై భిన్నాభిప్రాయాలు



మాట్లాడుతున్న జిల్లా అధికారి రామ్మోహన్‌రావు



అధికారిని సన్మానిస్తున్న చైర్మన్ నర్సింహారెడ్డి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : 'రైతుబంధు'చెల్లింపుపై నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట, తాండూర్‌లలో సోమవారం నిర్వహించిన సమావేశాలలో రైతులు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశారు. గోపాల్‌పేటలోని రైతువేదికలో నిర్వహించిన సమావేశంలో కొందరు రైతులు 5 ఎకరాలు, మరికొందరు పదెకరాలకు పరిమితం చేయాలని పేర్కొన్నట్లు మాల్తుమ్మెద సొసైటీ సీఈవో పవన్ తెలిపారు. మండలంలోని తాండూర్ సొసైటీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సమావేశంలోనూ భిన్నాభిప్రాయాలు వచ్చాయన్నారు. ఎక్కువ మంది రైతులు 5ఎకరాలకు పరిమితం చేయాలని కోరుతూ సొసైటీ సీఈవో జైపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లా సహకారశాఖ ఆడిట్ అధికారి రామ్మోహన్‌రావు, పర్యవేక్షణాధికారిణి రాధిక, నాగిరెడ్డిపేట ఎంపీపీ వినీతరెడ్డి, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఏడీఏ వీరాస్వామి, ఏవో విజయ్‌శేఖర్, సొసైటీల చైర్మన్‌లు నర్సింలు పాల్గొన్నారు.

అర్హులందరికీ వర్తింపజేయాలి..

నిజాంసాగర్(జుక్కల్): వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులందరికీ రుణమాఫీ, రైతు భరోసా వర్తించేలా ప్రభుత్వ పరంగా సమన్యాయం చేయాలని అచ్చంపేట సొసైటీ చైర్మన్ కయ్యం నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అచ్చంపేట రైతు వేదికలో రైతుబంధు, రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ నిర్వహించారు. 20ఎకరాల వరకు రైతు రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు పేర్కొన్నారు. మరికొందరు పదెకరాల్లోపే వర్తింపజేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ రిజిస్ట్రార్ సికింద్రాబాద్ వెంకట్‌రెడ్డి, ఎల్లారెడ్డి అసిస్టెంట్ సబ్ రిజిష్టార్ శ్రీనివాస్, సొసైటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, ఏవో అమర్‌ప్రసాద్ తదితరులున్నారు.

కొత్త చట్టం ప్రకారం కేసు నమోదు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిదిలోని గండివేట్ ఉన్నత పాఠశాలలో అమర్చిన డిజిటల్ టీవీని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు ఎస్సై ఆంజనేయులు సోమవారం తెలిపారు. రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం పాఠశాల ముగిసిన అనంతరం అన్ని గదులకు తాళాలు వేసి ఉపాధ్యాయులు వెళ్లిపోయారు. ఆదివారం సెలవు కావడంతో ఎవరూ రాలేదు. సోమవారం ఉదయం వచ్చే సరికి 8వ తరగతి గదిలో అమర్చిన డిజిటల్ టీవీ ధ్వంసమైనట్లు గుర్తించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం రమేశ్ ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించి గుర్తు తెలియని వ్యక్తులపై కొత్త చట్టం మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైక్ చోరీ నిందితుడి అరెస్ట్

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : బైక్ చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం లింగంపేట మండలంలోని మెంగారం గ్రామానికి చెందిన అశోక్ తన బంధువులు ఎల్లారెడ్డి పట్టణంలోని నాగేశ్వర్‌రావు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో అతడిని పరామర్శించేందుకు గతనెల 17న రాత్రి వచ్చి బైక్‌ను ఆస్పత్రి బయట ఉంచారన్నారు. తెల్లారి లేచి చూసే సరికి బైక్ లేకపోగా పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. సోమవారం వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న నాగిరెడ్డిపేట తాండూర్‌వాసి కర్రోల్ల రాజును ప్రశ్నించగా బైక్ చోరీ విషయం ఒప్పుకున్నాడన్నారు.

29 వాహనాలు సీజ్



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న 29 వాహనాలను పట్టణ పోలీసులు సోమవారం సీజ్ చేశారు. ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని సూచించారు. నిబంధనల ప్రకారం నంబర్ ప్లేట్లు ఉండాలని స్పష్టం చేశారు.

కొడుకును చంపిన తండ్రి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవీందర్‌నాయక్

ఎల్లారెడ్డి: భూమి పంపిణీ విషయంలో తరచూ ఇబ్బందులకు గురి చేస్తున్న తనయుడిని హత్య చేసిన తండ్రిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవీందర్‌నాయక్ తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేటకు చెందిన పాడిపాక సాయిలు(40)ను అతడి తండ్రి పాడిపాక వెంకటేశ్ గత నెల 28వ తేదీన రాత్రి టవల్‌తో గొంతు నులిమి, కర్రతోబాది హత్య చేశాడు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా పక్కనే ఉన్న పోచారం కాలువలో సాయిలు మృత దేహాన్ని పారేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు వెంకటేశ్‌ను విచారించగా, పొలం పంపకం విషయంలో తరచూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తానే హత్య చేసినట్లు నేరం అంగీకరించాడు. సాయిలును హత్య చేసేందుకు నిందితుడు ఉపయోగించిన టవల్‌తోపాటు కర్రను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై మహేశ్, హోంగార్డులు పెంటయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

- బాన్సువాడ, బోధన్‌లో తనిఖీలు
- ముగ్గురి అరెస్ట్, రిమాండ్



గంజాయిని చూపుతున్న పోలీసులు

బాన్సువాడ : పట్టణంలోని పీఆర్ గార్డెన్ వెనుక ప్రాంతంలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. నిందితుడు అందించిన సమాచారం మేరకు బోధన్‌లోని ఇంటిపై దాడి చేసి మరో 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. డీఎస్పీ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.. బాన్సువాడలోని కొయ్యగుట్ట సమీపంలో ఉన్న పీఆర్ గార్డెన్ వెనుకాల గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు టౌన్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించి గంజాయి విక్రయిస్తున్న సీమల శ్రీకాంత్ అనే వ్యక్తిని పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని విచారించగా.. తాను బోధన్ పట్టణంలోని రాకాసీపేట్‌కు చెందిన నస్రీన్ బేగం అలియాస్ సుమేరాభాను అనే మహిళ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపాడు. దీంతో పోలీసులు బోధన్‌కు వెళ్లి నస్రీమ్ బేగం ఇంట్లో సోదాలు నిర్వహించి 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలితోపాటు ఆమె మామ రషీద్‌ను విచారించగా మహారాష్ట్రలోని నాయ్‌గావ్ ప్రాంతం నుంచి గంజాయి తెచ్చినట్లు ఒప్పుకున్నారు. శ్రీకాంత్, నస్రీమ్ బేగం, రషీద్‌పై కేసు నమోదు చేసి ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయి కేసును చాకచక్యంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన టౌన్ సీఐ కృష్ణ, సిబ్బందిని ఎస్పీ సింధుశర్మ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ.. ఇద్దరు మృతి

- ఘటనాస్థలంలో ఒకరు..
- చికిత్స పొందుతూ మరొకరు
- మృతులు గాంధారి మండలం కాటేవాడికి చెందిన వారు..



రవీందర్(ఫైల్)



దేవీసింగ్ (ఫైల్)

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రం శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టింది. ఘటనాస్థలంలో ఒకరు మృతి చెందగా, మరొకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గాంధారి మండలం కాటేవాడి తండాకు చెందిన కొర్ర రవీందర్(24), మిత్రుడు దేవిసింగ్ కలిసి ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ కోసం కామారెడ్డికి వెళ్లి స్వగ్రామానికి తిరిగి వెళ్తున్నారు. మండల కేంద్రం శివారులోని 44వ నంబర్‌జాతీయ రహదారిపై మల్లుపేట్ వాగు సమీపంలోని తాజ్‌ఫ్యామిలీ దాబా వద్ద ట్రాక్టర్‌ను వెనుక నుంచి అతివేగంగా వచ్చినలారీ ఢీకొట్టింది. ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లడంతో డ్రైవింగ్ చేస్తున్న దేవిసింగ్(34)తోపాటు రవీందర్ రోడ్డుపై పడిపోయారు. తలకు తీవ్రగాయాలై రవీందర్ అక్కడి కక్కడే మృతి చెందాడు. దేవిసింగ్‌ను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవీందర్‌కు మూడు నెలల క్రితం వివాహమైందని గ్రామస్తులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

బస్సు ఢీకొని యువకుడు..



సాయికిరణ్ (ఫైల్)

వర్ని (మోస్రా): ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొట్టిన ఘటనలో యువకుడు మృతి చెందాడు. మోస్రా మండలం గోవూర్ శివారులో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. రుద్రూర్ మండలం చిక్కడపల్లికి చెందిన సాయికిరణ్ (18) వర్ని నుంచి నిజామాబాద్ వైపు వెళ్తుండగా, గోవూరు శివారులో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన సాయి కిరణ్‌ను స్థానికులు 108 అంబులెన్స్‌లో నిజామాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు.

ప్రమాదవశాత్తు పొలంలోపడి..

వర్ని (చందూర్) : ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి వ్యవసాయభూమిలోని బురద లోపడి మృతి చెందినట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. చందూరుకు చెందిన గంగోటి నారాయణ (70) గత నెల 28వ తేదీన గ్రామ శివారులోని తన పొలానికి వెళ్లి తిరిగిరాకపోవడంతో కుటుంబ స భ్యులు పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. అయితే, సోమవారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం పొలాల్లోకి వెళ్లిన రైతులు నారాయణ మృతి చెంది ఉండడాన్ని గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



నారాయణ మృతదేహం

పాముకాటుతో మహిళ..



జనవ్వ (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కన్నాపూర్ తండాకు చెందిన గిరిజన మహిళ నునావత్ జనవ్వ(41) పాముకాటుతో మృతి చెందినట్లు తండావాసులు తెలిపా రు. ఆదివారం రాత్రి జనవ్వ భోజ నం చేసి నిద్రకు ఉపక్రమించింది. ఆమె నిద్రిస్తున్న స మయంలో నల్లత్రాచు పాము కాటు వేయగా, ఆమె వెంటనే తేరుకుని కుటుంబస భ్యులకు తెలుపగా, వారు ఆమెను హుటాహుటిన కామారెడ్డి ఆస్పపత్రికి తరలించారు.కాగా,జనవ్వ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.